వీఆర్వేల సమస్యలు ప్రభుత్వ దృష్టికి..

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: గ్రామ రెవెన్యూ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న వీర్యేల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసు కెళ్లడం తన బాధ్యతని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి స్పష్టంచేశారు. పట్టణంలో శుక్రవారం అసెంబ్లీలో రెవెన్యూ సమస్యలను ప్రస్తావించిన రామగోపాల్‌రెడ్డిని శుక్రవారం వీఆర్యేలు ఘనంగా సన్మానించారు. తమ సమస్యలను ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లడం పట్ల వారు రామగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ సమస్యల పరిష్కారం కోసం ఆయన మద్దతు కొనసాగించాలని వారు కోరుతూ వినతిపత్రం అందజేశారు. రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వీఆర్యేల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తన బాధ్యతగా భావిస్తున్నానని గ్రామ సేవకలు సేవలను నిస్వార్థంగా అందిస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘానికి చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శనివారం, 18 అక్టోబర్ 2025 | 8 పేజీలు

నకిలీ మద్యం కేసు.. దర్యాప్తు వేగవంతం

- నిందితులను కస్టడీకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు
- విచారిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, సిట్ అధికారి

విశాలాంధ్ర-మదనపల్లె: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యం కేసు దర్యాప్తును ఎక్సైజ్ పోలీసులు వేగవంతం చేశారు. ఈ కేసులో మూలాలను కనుక్కొని పెద్ద తలకాయిని పట్టుకునే పనిలో నిమగనమయ్యారు. ఈ మేరకు ఇప్పటికే అరెస్ట్ అయ్యి జైల్లో ఉన్న పదిమంది నిందితులను కస్టడీకి కోరుతూ కోర్టుకు విన్నవించారు. కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక సబ్ జైల్లో ఉన్న పదిమంది నిందితులు సయ్యద్ హాజీ, కుక్కల బాలరాజు, గణేషన్ మనిమారన్, అనంతన్ శ్రీనివాసన్, సూరియా వెంగదేశన్, వెంకటేషన్ సురేష్, మిథున్ దాస్, అంతదాస్, కట్టా సురేంద్రనాయుడు, నాగరాజులకు వైద్య

..మిగతా 2లో

దీపావళి దోపిడీకి వేళాయె!

- టపాసుల విక్రయాల్లో అక్రమాలకు ప్రణాళికలు
- పన్ను టోకరాకు సిద్ధం
- నివాసాల మధ్యనే దుకాణాలు
- 18 సంవత్సరాలు నిండని మైనర్లతో దుకాణాల నిర్వహణ
- మూడింతల ధరలతో కొనుగోలు దారుల నడ్డి విరుస్తున్న వైనం

విశాలాంధ్ర-గాలివీడు: దీపావళి పండుగ వస్తోందనగానే.. దోపిడీకి తెరలేపుతారు అక్రమార్కులు. ఈ ఏడాది కూడా అదే దిశగా కుయుక్తులు పన్నుతున్నారు. టపాసుల విక్రయాల మాటున కోట్లాది రూపాయలు వెనకేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. పండుగ సందర్భంగా లక్షలాది రూపాయల విలువ చేసే టపాసుల విక్రయాలు సాగుతాయి. తమిళనాడులోని శివకాశి తదితర ప్రాంతాల నుంచి టపాసులను తక్కువ ధరకు తీసుకొచ్చే వ్యాపారులు ప్రజలకు మాత్రం మూడింతలు అధిక ధరలకు అమ్ముతూ వారి జేబులకు చిల్లు పెడుతున్నారు. పన్నుల శాఖ ద్వారా ప్రభుత్వాలకు అందాల్సిన ఆదాయం విషయంలో లక్షల రూపాయలకు గండి పడుతోంది. పన్ను ఎగ్గొట్టేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. రెగ్యులర్ లైసెన్స కలిగిన డీలర్లు పాతికశాతం మాత్రమే పన్ను చెల్లించి,మిగిలిన మొత్తానికి టోకరా వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరికొందరు లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. వాస్తవానికి టపాసుల విక్రయదారులు పన్నుల శాఖకు 18శాతం చెల్లించాలి. దుకాణం లైసెన్స్, టిన్ నెంబరు ఉన్న స్లిప్పు మీద ఇన్వాయిస్ బిల్లులు కాకుండా కేవలం తెల్ల కాగితం మీద బిల్లులు రాసి పంపుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. గాలివీడు మండలంలో 4 టపాసుల గోడౌన్లు ఉన్నాయి. వీరు సరఫరా చేసే బాణాసంచా విలువ రూ.100 ఉంటే వాటిపై రూ.500కు పైగా,రూ.200 ఉంటే రూ.1000 కిపైగా ధర ముద్రించి ఉంటుంది. వీరు షాపులకు వచ్చే వ్యక్తులను బట్టి టపాసుల ధరలు నిర్ణయించి, అమ్మకాలు చేస్తూ ప్రజల జేబులను ఖాళీ చేస్తున్నారు. ఏటా లక్షల్లో వ్యాపారం సాగుతుందని ఆ వర్గాలు చెబుతున్నాయి.దీపావళి సందర్భంగా మూడురోజుల్లోనే కోటి రూపాయలు వరకు అమ్మకాలు సాగుతాయి. పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు, వేడుకల సమయంలో రూ.లక్షల్లో టపాసులు విక్రయిస్తుంటారు. పన్ను చెల్లించకుండా వ్యాపారం నిర్వహిస్తున్నా అధికారులు చూసీ చూడనట్ల వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కొందరికి పెద్ద మొత్తంలో మామూళ్లు ముడుతున్నాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

..మిగతా 2లో

పన్ను టోకరాకు సిద్ధం

ఏటా టపాసుల వ్యాపారం విషయంలో అక్రమార్కులు పన్నుల శాఖకు టోకరా వేస్తూనే ఉన్నారు.మండలంలో టపాసుల విక్రయానికి సంబంధించి ఎంత మందికి రెగ్యులర్ లైసెన్స ఉంది? అనేది ప్రశ్నార్థకమే? ఎక్కడపడితే అక్కడ గోదాముల్లో దాచి, అమ్ముతున్నా పట్టించుకునేవారు లేరు.వీరి నుంచి పన్నుల శాఖకు 25శాతం మాత్రమే జీఎస్టీ అందుతోందని తెలిసింది. శివకాశి నుంచి తెచ్చిన టపాసుల్లో 80శాతం బిల్లులు లేకుండానే మాయ చేస్తున్నట్లు తెలుస్తోంది. పన్నుల శాఖలో విధులు నిర్వర్తించే ఉన్నతాధికారులకు ఏటా ముడుపులు అందుతుంటాయని సమాచారం.

మైనర్లతో దుకాణాల నిర్వహణ

దుకాణాల్లో 18 సంవత్సరాల లోపు పిల్లలు ఉండకూడదని అధికారులు చెబుతున్నప్పటికీ దుకాణదారులు మాత్రం నిబంధనలకు నీళ్లొదలి 18 సంవత్సరాలలోపు పిల్లలతో దుకాణాలు నిర్వహిస్తున్నారు. కనీస అవగాహనలేని చిన్నపిల్లలను దుకాణాలలో ఉంచడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

అసంవాద బ్యాంకు ఖాతాలను నిర్వహణలోకి తీసుకురావాలి

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: భారత ప్రభుత్వం అసంవాదనీయ బ్యాంక్ డిపాజిట్లు, వాటాలు, బీమా మరియు పొదుపు పథకాల నిధులు నిజమైన హక్కుదారులకు తిరిగి చేరేలా బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో.. 7-10 సంవత్సరాల పాటు నిరుపయోగంగా ఉన్న అసంవాద అకౌంట్లను తిరిగి నిర్వహణలోకి తీసుకువచ్చే ఉద్దేశ్యంతో భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ చేపట్టిన అవగాహన కార్యక్రమానికి సంబంధించి జిల్లా కలెక్టర్ బ్రోచర్లను విడుదల చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మూడు నెలలపాటు ప్రత్యేక ప్రచారం ప్రారంభించి.. సంబంధిత అకౌంట్లను యాక్టివేట్ చేసేలా బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. బ్యాంకు కంట్రోలర్లు మరియు సమన్వయకర్తలు తమ శాఖలను చైతన్యపరచి, డీఈఏ ఖాతాదారులకు లేఖలు పంపించాలని సూచించారు. అన్ని బ్యాంకులు ఆయా శాఖలలో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించి, అవగాహన శిబిరాలు నిర్వహించి డీఈఏ నిధులను నిజమైన హక్కుదారులకు తిరిగి చెల్లించాలన్నారు. బ్యాంకులు తమ కస్టమర్లను లేదా డిపాజిటర్లను ప్రోత్సహించి, డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌లో ఉన్న అసంవాదనీయ డిపాజిట్లను నిజమైన హక్కుదారులకు తిరిగి ఇవ్వడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డిఎం జనార్ధనం, సీపీవో హజరతయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతీ పాల్గొన్నారు.

పకడ్బందీగా బాణాసంచా నిర్వహణ

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే
- అనుమతులు లేని స్టాల్స్‌పై కొరడా
- దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి
- అధికారుల సమావేశంలో కలెక్టర్ నిశాంత్

విశాలాంధ్ర-రాయచోటి: ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు తదితర అంశాలపై అన్ని మండలాల తాసిల్దార్లు, పోలీసు, అగ్ని మాపక శాఖ విద్యుత్ శాఖ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిమాపక ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన్ మ్యాన్ కమిటీ ఇచ్చిన సూచనలు అన్నింటిని టపాసులు అమ్మే షాపుల యాజమాన్యం వారు పాటించేలా చర్యలు చేపట్టాలని, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్లను, ఆర్డీవోను ఉద్దేశించి మాట్లాడుతూ అన్ని బాణసంచా తయారీ గోడౌన్లను, స్టాళ్లను పరిశీలించి షాపుల యాజమాన్యం వారితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. బాణసంచా విక్రయకేంద్రాల నిర్వాహకులు ఈ క్రింది నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డిఆర్ఓ మధుసూదనరావు, అగ్గిమాపక శాఖ అధికారి అనిల్ కుమార్, విద్యుత్ శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, మ్యాజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుప్రీంకోర్టు జడ్జిపై దాడి హేయం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అని ఎంఆర్‌పిఎస్ నాయకులు అన్నారు. దాడిని ఖండిస్తూ శుక్రవారం ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఎర్రంపల్లి జ్ఞానేశ్వర్ రావు, ఎంఈఎఫ్ మండల కార్యదర్శి సోమిరెడ్డిపల్లి ఓబయ్య, ఎంఎస్పి మండల అధ్యక్షులు సగిలి సుభాష్ ఆధ్వర్యంలో డా.బిఆర్అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం మండల డిప్యూటీ తహశీల్దార్ జాన్సన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు జయచంద్ర, జీవన్, జగన్, ప్రభాకర్, హరి, జానయ్య, భాస్కర్, ఆల్ఫా తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ మద్యం వైసీపీ పుణ్యమే'

విశాలాంధ్ర-మదనపల్లి: కల్తీ మద్యం వైసీపీ పుణ్యమేనని టిడిపి నాయకులు ఆరోపించారు. పట్టణంలోని బెంగళూరు బస్టాండ్ టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కల్తీ మద్యం నింద మోపడం వైసిపి వారి పనేనని దుయ్యబట్టారు. ఆసియా ఖండంలో అతి పెద్దదైన మదనపల్లి టమోటా మార్కెట్ యార్డ్ గురించి అసెంబ్లీలో మాట్లాడి తక్షణమే సానిటోరియం దగ్గర స్థలాన్ని పరిశీలించి అభివృద్ధి పథంలో తీసుకొని వెళ్తున్న సందర్భంగా ఓర్పుకోలేక ఎక్కడ ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తారని రాబోయే 10 సంవత్సరాలు షాజహాన్ భాషా ఎమ్మెల్యేగా కొనసాగుతారని. ఎమ్మెల్యే ఎప్పుడు ప్రజలు అండగా ఉంటారని జీర్ణించుకోలేక కొందరు వైసీపీ నాయకులు వారి ప్రభుత్వంలో అభివృద్ధి చేయలేక ఈరోజు అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని. టిడిపి నాయకులు సుధాకర్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్స్ శివన్న, సిద్దప్ప, బాలు స్వామి, నీలకంఠ షంషీర్, వెంకటరమణ, దారం అనిత తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా హంద్రీనీవా కాలువ మరమ్మతులు

విశాలాంధ్ర-బి.కొత్తకోట: మండలంలోని గట్టు పంచాయితీ గుండ్లపల్లి సమీపంలో 110 కిలోమీటర్ల దగ్గర ఉన్న హంద్రీనీవా పుంగనూరు బ్రాంచ్ కాలవ తెగిన విషయం తెలిసినదే. విషయం తెలుసుకున్న కలెక్టర్ నిశాంత్ కుమార్ కాలవను పరిశీలించి వెంటనే పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని హెచ్ఎన్ఎస్ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు గత రెండు రోజులుగా జెసిపి హిటాచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి మరమ్మతులు చేపట్టారు. కాలవకుండా నీళ్లు రాకుండా చెర్లోపల్లి డ్యాం దగ్గర నిలిపివేశారు. దీంతో మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. గత వారంలో కరెంటు లేకపోవడం వల్ల మోటార్స్ ఆగి పోవడంతో నీళ్లు ఎక్కువ కాలంలో స్టోరేజ్ అయికాలువ తెగిపోయింది. దీంతో కాలవగుండా నీరు ఆపి మరమ్మతులు చేపట్టారు. మళ్లీ ఇలాంటి సమస్యలు రాకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-రాజంపేట: అన్నమాచార్య విశ్వవిద్యాలయం లోని స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్, నేషనల్ సర్వీస్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" అనే అంశంపై ఒక ఆలోచనాత్మక గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత పిన్న వయస్కుడైన చార్టర్డ్ అకౌంటెంట్ డా. సి.ఎ అశోక్ కుమార్ ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, "జీఎస్టీ కేవలం పన్ను విధానం మాత్రమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణ. పౌరులు జీఎస్టీ విధానాన్ని అర్థం చేసుకొని సక్రమంగా పాటిస్తే దేశ ఆర్థిక వృద్ధి వేగవంతమవుతుంది, పారదర్శకత పెరుగుతుంది, అవినీతి తగ్గుతుంది,"అని అన్నారు. ఆయన భారతదేశంలో జీఎస్టీ పరిణామక్రమం, ఒకే పన్ను విధానం వల్ల వ్యాపార సౌలభ్యం పెరగడం, డిజిటల్ పన్ను విధానాల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అశోక్ కుమార్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, రివర్స్ ఛార్జ్ మెకానిజం కాంపోజిషన్ స్కీమ్, డిజిటల్ ట్యాక్స్ ఫైలింగ్, స్టార్టప్‌లకు లభించే పన్ను ప్రయోజనాలు, పన్ను పొదుపు వ్యూహాలు వంటి ముఖ్య అంశాలను సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. జీఎస్టీ ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలపడటంతో పాటు, చిన్న వ్యాపారాలకు లభించే రాయితీలు దేశ ఆర్థిక సుస్థిరతకు దోహదం చేస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని జీఎస్టీ రిజిస్ట్రేషన్, పన్ను మినహాయింపులు, మరియు ఆన్‌లైన్ రిటర్న్ ఫైలింగ్ ప్రక్రియపై ప్రశ్నలు అడగగా, ఆయన ప్రతి ప్రశ్నకు ఆచరణాత్మక సమాధానాలు ఇచ్చి ఆర్థిక సాక్షరత పట్ల ఆసక్తి రేకెత్తించారు. అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డా.సాయి బాబా రెడ్డి, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డా.టి.నవనీత, అలాగే విభాగ ఫ్యాకల్టీ సభ్యులు విద్యార్థులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు అందరం పని చేద్దాం

విశాలాంధ్ర-రాయచోటి: ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు సమాజంలోని అందరం పని చేద్దామని ప్రజా చైతన్య సేవా సంఘం ఓఆర్ డబ్ల్యు విజయలక్ష్మి కోరారు. రామాపురం మండలం కస్తూరిబాయి కళాశాలలో శుక్రవారం ఎయిడ్స్ వ్యాధి అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది నివారణ చర్యలు వివరించారు. వ్యాధిగ్రస్తులకు మందులు ఎక్కడ పంపిణీ చేస్తారు, మందులు ఎలా వాడాలి వివరించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.పుష్పలత మాట్లాడుతూ ఎయిడ్స్ అవగాహన సదస్సులు యువతి యువకులకు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుజాత రెడ్డి, అరుణ కుమారి విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

అధికార పార్టీ నుండి వైఎస్ఆర్సిపిలోకి చేరిక

విశాలాంధ్ర-వీరబల్లి: మండలంలోని వంగిమల్ల గ్రామం నుండి దాదాపు పది కుటుంబాల టిడిపి కార్యకర్తలు శుక్రవారం వైఎస్ఆర్సిపి పార్టీలో చేరడం జరిగింది. వీరబల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చేరడం జరిగింది. చేరిన వారిలో పెదివేటి వేరు నాగయ్య, చెన్నయ్య, బాలయ్య, ఆలీ బాబు, అశోక్ కుమార్, తదితరులు పార్టీలో చేరారు. వంగిమళ్ళ పంచాయితీ కొండరి వైఎస్ఆర్సిపి నాయకుల సహాయ సహకారాలతో వీరు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ప్రజలకు ఏమి న్యాయం జరగలేదన్నారు, ప్రజలు నేటికీ నిరుత్సాహంతో బతుకుతున్నారని తెలిపారు. గత జగనన్న పరిపాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఆర్థిక అభివృద్ధితో జీవనం సాగించే వారని వారు పేర్కొన్నారు. అనంతరం వైఎస్ఆర్సిపి నాయకులు కలిసి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్గా ఎన్నికైన విజయభాస్కర్ రెడ్డిని, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని, రాజంపేట నియోజకవర్గం వైఎస్ఆర్సిపి యువ నాయకులు మదన్ రెడ్డిని పూలదండలతో సాల్వాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ పార్టీ నాయకులు రెడ్డప్ప రెడ్డి, తారకేశ్వర్ రెడ్డి, సురేంద్ర నాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

తహసిల్దార్ కార్యాలయమా?.. వ్యాపార కార్యాలయమా?

విశాలాంధ్ర-వీరబల్లి: ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఏకంగా కార్యాలయంలోనే దుకాణం పెట్టిన వీరబల్లి మండల తహసిల్దార్ ఖాజాబీ, కార్యాలయ సిబ్బంది. శుక్రవారం సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారు లను తన ఛాంబర్‌లోకి రానీయకుండా బయటే గంటలకు కొద్ది కూర్చోబెట్టి దర్జాగా తన సిబ్బందితో కలిసి నగల వ్యాపారిని కుర్చీలో కూర్చోబెట్టుకొని నగలను ముందు ఉంచుకొని బేర సారాలు ఆడుతూ తహసిల్దార్ సెల్ ఫోన్‌లో కాలక్షేపం చేస్తున్న సిబ్బంది. ఇది తహసిల్దార్ కార్యాలయం లేక వ్యాపార సముదాయమా అంటూ గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అదేవి ధంగా అర్జీదారులు కూడా బయట కనీసం అర్ధ గంట వరకు కూడా బయటే ఉన్నారని అర్జీదారులు తెలిపారు. ఈ విషయంపై మండల తహసిల్దార్‌ను విశాలాంధ్ర విలేఖరి వివరణ కోరగా వాట్సాప్‌లో ఈ వీడియో ఎవరు పంపించినారో వాళ్లనే అడుగు అని ఫోన్ కట్ చేశారు.

నకిలీ మద్యం కేసు దర్యాప్తు వేగవంతం

మొదటి పేజీ తరువాయి

పరీక్షలు నిర్వహించిన అనంతరం బెంగళూరు రోడ్డులోని ఎక్సైజ్ స్టేషన్ తరలించి కస్టడీలోకి తీసుకున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ బృందంలోని అధికారి విజయవాడ నుంచి వచ్చిన అధికారి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్రలు ఈ విచారణలో పాల్గొన్నారు.

ఈనెల 3న విషయం వెలుగులోకి..

ములకలచెరువు కేంద్రంగా పెద్ద ఎత్తున నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ అధికారుల ద్వారా తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు అక్టోబర్ 3వ తేదీన దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1.75 కోట్లు విలువ చేసే నకిలీ మద్యాన్ని సీజ్ చేసే, మద్యం తయారీలో ఉన్న పదిమందిని అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా నకిలీ మద్యం తయారీ లో ప్రధాన నిందితుడు జనార్దన్ రావు తో పాటు కేసులో ప్రమేయం ఉన్న కట్టారాజు, బాలరాజు, రాజేష్, గణేష్, అనంత శ్రీనివాసన్, సూర్య వెంకటేశం, మిథున్ దాస్, శ్రీనివాస్ రావు, సురేంద్ర, నాగరాజు, బాలాజి, రవి, దాసరపల్లి జయచంద్రారెడ్డి (తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్, గిరిధర్ రెడ్డి (మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి బావమరిది), అంబురాజు, సుదర్శన్, అష్రఫ్, చైతన్య, శ్రీనివాస్ రెడ్డి, కట్టా సురేంద్ర నాయుడు ఇలా 23 మందిపై కేసులు నమోదు చేశారు. మొదటి రోజు పది మందిని అరెస్ట్ చేసిన పోలీసులు అనంతరం ఈ కేసులో ప్రమేయం ఉన్న ప్రధాన నిందితుడు జనార్ధన్ రావుని అరెస్ట్ చేశారు. దీంతో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. తంబళ్లపల్లి టిడిపి ఇన్చార్జి దాసరపల్లి జయచంద్రా రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరిగిందని భావించిన పార్టీ అధిష్టానం అతన్ని సస్పెండ్ చేసింది. అతనితో పాటు మరో ప్రధాన నిందితుడు కట్ట సురేంద్రనాయుడిని సస్పెండ్ చేసింది. ఇప్పటివరకు 15 మంది అరెస్ట్ కాగా మరో ఎనిమిది మంది అరెస్టు కావాల్సి ఉంది. వీరిలో జయచంద్రారెడ్డి, అతని పీఏ రాజేష్ తదితరులు ఉన్నారు. నిందితులను రెండు రోజుల పాటు కస్టడికి కోరిన ఎక్సైజ్ పోలీసులు, మొదటి రోజు శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు విచారణ చేసి తిరిగి సబ్ జైలుకు తరలించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు 496వ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-రాజంపేట: రాజంపేట పట్టణ కేంద్రంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయలు 496వర్ధంతి వేడుకలను రాజంపేట పట్టణం లో ఘనంగా నిర్వహించారు. కాప్స్ రాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా భారతీయ జనత పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వి రమణ లతోపాటు పలువురు ప్రముఖులు నేతలు హాజరయ్యారు. ఇందులో భాగంగా పాత బస్టాండ్ సర్కిల్లో ఉన్న శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి లోకేష్ కాప్స్ రాక్స్ జోనల్ అడ్మిన్ పిఆర్ఓ నేతి నాగేశ్వర ఉప్పు సాంబశివరావు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు వారి 496 వర్ధంతిని ఆంధ్ర రాష్ట్రంలోనే కాకుండా యావత్ దక్షిణ భారతదేశంలో ఆయనకు ఘన నివాళులు అర్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రమణ, నరసింహులు, పలుకూరు వెంకటరమణ, శివరామరాజు, బండ్ల రాజేష్, పలుకూరు అశోక్ కుమార్, గురునాదం, చంద్రశేఖర్, పలుకూరి భాస్కర్, కొట్టె శ్రీహరి, ధరిమిశెట్టి విజయ్, వర్ధనగారి ప్రసాద్, వెంకటసుబ్బయ్య, కాప్స్ రాక్స్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దీపావళి దోపిడీకి వేళాయే!

మొదటి పేజీ తరువాయి

నివాసాల మధ్యనే దుకాణాలు

దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు అడ్డగోలుగా ఏర్పాటవుతున్నాయి. జనావాసాలు, వాణిజ్య ప్రాంతాలు, రహదారుల పక్కన ఇష్టారీతిన ఏర్పాటు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గాలివీడు పట్టణంలో ప్రతీ ఏటా గొర్లసంత ప్రాంగణంలో అనుమతులు ఇస్తుండటంతో ఆప్రాంతంలో చుట్టూ దుకాణాలు,నివాసాలు ఉండటం కారణంగా స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దుకాణాలను అధికారులు మాత్రం మామూళ్లకు అలవాటుపడి ఇష్టారీతిన అనుమతులు మంజూరు చేస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే పట్టణ శివారుప్రాంతంలో జనసంచారం లేని చోట దుకాణాలు ఏర్పాటు చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే కొన్ని గోడౌన్లు కూడా నివాసాల వద్ద ఉండటం ప్రాణాంతకంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బాణసంచా దుకాణదారులు నిబంధనల మేరకే నడుచుకోవాలి. నివాసాల మధ్య జనవాసాల ప్రాంతంలో దుకాణాలు నడుపకూడదు. అధిక ధరలకు విక్రయించిన, టపాసుల దుకాణాల్లో మైనర్ల ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- భాగ్యలత, తహసీల్దార్, గాలివీడు

టిడిపిలో కష్టపడి పని చేసే వారికి ప్రాధాన్యత

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందే తప్ప కోవర్టులకు ఉండదని టీడీపీ కార్పొరేటర్ సుబ్బారెడ్డి, పార్టీ నగర కమిటీ అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా కడప నగరంలోని ఎమ్మె ల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత వారు టీడీపీ పేరు చెప్పుకుంటూ వైసీపీ నేతలతో కలిసి ఉన్న ఫోటోలను ఆవిష్కరించారు.

ప్రకటన

అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం దేవరాయపల్లి H/oనాగవరం గ్రామంలో వెలసిన శ్రీ రామలవారి దేవస్థానమును దేవాదాయ చట్టము 30/87 ప్రకారము రిజిస్ట్రేషన్ మరియు పబ్లికేషన్ చేయుటకు ఏవైనా అభ్యంతరాలు ఉన్న ఎడల ఈ ప్రకటన వెలువడిన 10 రోజుల లోపల అన్నమయ్య జిల్లా దేవాదాయ శాఖ జిల్లా అధికారి గారికి లిఖితపూర్వకంగా తెలియజేయగలరని ఇన్స్పెక్టర్ S.జనార్ధన్ ఒక ప్రకటనలో తెలియ చేయడమైనది.

ఇట్లు
కె ఉమామహేశ్వర రెడ్డి
స్పాన్సర్

ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్సీ పిఆర్, గిరిధర్ రెడ్డి

విశాలాంధ్ర-మైలవరం: ప్రభుత్వం అవలం బిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వైసిపి అనుబం ధ విభాగాల కమిటీల దేనని వైకాపా నేత, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, గిరిధ ర్ రెడ్డిలు అన్నారు. శు క్రవారం జమ్మలమ డుగు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి ఆ దేశం మేరకు మైలవరం మండల వైఎస్సా ర్సీపీ మూడంచలస్థాయిలో పరిశీలకుల ని యామకం సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడా రు. ఎమ్మెల్సీ, గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ మండల వైసీపీ కమిటీ మరియు అనుబం ధాల కమిటీలపై క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రజా వ్యతిరేక వి ధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకందరికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనుబంధ విభాగాల కమిటీల నిర్మాణంలో ఎన్నికైన వారు అలసత్వం ప్రదర్శించకుండా ఉత్సాహం, తపన,బాధ్యతతో పనిచేయాలని అలాంటి వారికె కమిటీలలో ప్రాధాన్య తీయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్య క్రమంలో వైసిపి జిల్లా నేత నారపరెడ్డి మోహన్ రెడ్డి, చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, శివ గురువు రెడ్డి, నవాబుపేట భాస్కర్ రెడ్డి, నార్జం పల్లె శివారెడ్డి, దొడియం కిషోర్ కుమార్ రెడ్డి, మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: మండలంలో బాణాసంచా లైసెన్స్ దారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా షాప్ సీజ్ చేసి బ్లాక్ లిస్టులో ఉంచుతామని తహశీల్దార్ కోనేటి అమర్ నాథ్,ఫైర్ ఆఫీసర్ కె విజయ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాణాసంచా లైసెన్స్ దారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారులు కేటాయించిన స్థలంలోనే శ్రీ కృష్ణా సినిమా థియేటర్ వెనుక ప్రాంతంలో బాణాసంచా విక్రయాలు కొనసాగించాలన్నారు. ప్రతి దుకాణ దారుడు విద్యుత్ కోసం అధికారులచే అనుమతి పొందాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ మానస, ఆర్ఐ లక్ష్మిదేవి, ఫైర్ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, హోంగార్డు శీను, బాణాసంచా లైసెన్స్ దారులు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఇంచార్జ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మైలవరం: టిడిపి జమ్మలమడు గు నియోజకవర్గ ఇన్చార్జి భూపేష్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు,కార్యకర్త, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఉదయం జమ్మల మడుగు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అంకిత భావంతో పని చేస్తూ సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తున్న భూపేష్‌ను అభినందించారు. అంతేకాకుండా సీఎం సహాయ నిధి ద్వారా అత్యధిక మంది బాధితులకు సహాయాన్ని అందించడం కూడా హర్షనీయమన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ, పలు మండలాల్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారిని మాజీ ఎమ్మెల్సీ అభినందించారు. చరిత బిల్డ ర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి, టిడిపి నాయకు లు సూర్య పెద్దిరాజు యాదవ్, కొండయ్య యాదవ్,టిడిపి మైలవరం మండల కన్వీనర్ చిన్నపాపిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రాజారెడ్డి,మాజీ ఎంపీటీసీ నర్సింలు యాదవ్,బాల హుస్సేన్ రెడ్డి,శ్రీనివాసులు రెడ్డి, నీలకంట రెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదాయ వనరులను సమకూర్చుకోవాలి

- ఎంపీడీవో పణిరాజకుమారి

విశాలాంధ్ర-సిద్దవటం: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామ పం చాయతీలోని ఆదాయ వనరులను సమకూ ర్చుకొని పంచాయతీ లను అభివృద్ధి పరచు కోవాలని ఎంపిడిఓ పణి రాజకుమారి తెలిపా రు. మండల కేంద్రం అయిన సిద్దవటం లోని ఎంపీడీవో కార్యాలయం సభా భవనంలో శు క్రవారం గ్రామపంచాయతీలలో సొంతగా వనరులను సమకూర్చుకునే అభివృద్ధిపై శిక్ష ణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పణి రాజకుమారి మాట్లాడుతూ గ్రామపంచాయతీలు ప్రభుత్వము ఇచ్చే స్కీముల మీద ఆధారపడకుండా గ్రామపంచా యతీలో ఖాళీగా ఉన్న స్థలాల్లో షాపింగ్ కాం ప్లెక్స్ నిర్మించుకొని వాటి బాడుగుల ద్వా రా ఆదాయాన్ని పొందాలన్నారు. గ్రామపం చాయతీలో నూతనంగా ఏవైనా ఫ్యాక్టరీలు గాని, నివాస గృహాలు గాని నిర్మించు కోవాలంటే గ్రామపంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గ్రామపం చాయతీలో ఉన్న ప్రతి ఒక్కరు సకాలంలో ఇంటి పనులు చెల్లించాలన్నారు. ఎవరైనా ఎన్నారైలు ముందుకు వచ్చి గ్రామాలను దత్తత తీసుకోవచ్చు అన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులను స్వచ్ఛందంగా నిర్వహించవచ్చు అన్నారు. గ్రామాల్లో నివాస గృహిణిలు చెత్తా, చెదారాలను ఎక్కడబడితే అక్కడ పడేయకుండా తడి చెత్తను ,పొడి చెత్తను వేరు చేసి గ్రామంలోకి హరిత రాయబారుల వాహనం వచ్చినప్పుడు అందులో పడేయాలని తెలియజేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరిశ్రమల అనుమతులను త్వరితగతిన మంజూరు

- సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాలాంధ్ర-రాయచోటి: సింగిల్ డెస్క్ విధానం క్రింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుండి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శు క్రవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్, ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ, డిఐఇపిసి) కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సింగిల్ డెస్క్ విధానం కింద గడచిన త్రైమాసికంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.కృష్ణ కిశోర్, డిఆర్ డిఏ పిడి నాగేశ్వరరావు, రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి, జెడ్ ఎం ఏపిఐఐసీ రమణమూర్తి, జిల్లా రవాణా శాఖ అధికారి, విద్యుత్ శాఖ అధికారి, దయా ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రతినిధి రాజశేఖర్, టెక్కి అసోసియేషన్ ప్రతినిధి రామ్మూర్తి నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, డీఆర్డీఏ ఇతర పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ చోర్ గద్ది చోడ్ కార్యక్రమం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ఓట్ చోర్ గద్ది చోడ్ కార్యక్రమంలో భాగంగా 40 డివిజన్ జ హర్ అహ్మద్, 47వ డివిజన్ మొహమ్మద్ హు సేన్, 44 డివిజన్ రహమతుల్లా సంయుక్తంగా కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ జరిపారు. ముఖ్యఅతిథిగా మైనార్టీ జనరల్ సెక్రెటరీ ఫేక్ కమల్ బాషా పాల్గొనడంతో ప్రజలు ఇంకా ఉత్సాహవంతంగా ముందుకు వచ్చారు. శుక్ర వారం వారు మీడియాతో మాట్లాడుతూ రాహు ల్ గాంధీ ప్రారంభించిన ఈ కార్యక్రమం రా జ్యాంగబద్ధంగా జరుగుతుందని రాజ్యాంగం లోని మన ఓటు హక్కును మనం సద్వినియో చుకో లేకపోవడం బాధాకరమని ఈ విష యంపై ఎలక్షన్ కమిషన్ కూడా స్పందించ కపోవడంతో ఈ ఉద్యమం మొదలుపెట్టామ న్నారు. ఈ ఉద్యమాన్ని పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ ఆధ్వర్యంలో సుమారు నెలరోజులు పాటు జరిగిన కార్యక్రమంలో కడప నగరంలో 40, 44, 47 డివిజన్లలో ప్రజలు స్వఛేదం గా వచ్చి సంతకాలు చేస్తున్నారని ఇందుకు కా రణం ప్రజలకు ఓటు చోరీ గురించి అవగా హన వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్‌పై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-మైదుకూరు: నియోజకవర్గం వ్యా ప్తంగా నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్నటు వంటి ఆర్ఎంపి క్లినిక్ సెంటర్ లపై వైద్య ఆరో గ్యశాఖ అధికారులు తనిఖీ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు మాట్లాడుతూ నియోజకవర్గంలో నిబంధనలు విరుద్ధంగా అర్హత లేకుండా డాక్టర్లు అని పేరుతో ఆర్ఎంపి క్లినికల్ నిర్వహి స్తూ ప్రజలకు వైద్యం చేస్తున్నారన్నారు. నిబంధ నల ప్రకారం నిర్వహించకుండా ఇంజక్షన్లు, సెలైన్ బాటిల్ వంటివి ఇస్తూ మెడిసిన్స్ రాస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నార న్నారు. తాత్కాలికంగా నోటీసులు ఇచ్చి వెళ్తున్నారు తప్ప నిబంధనకు విరుద్ధంగా నడుస్తున్న టువంటి క్లినిక్లపై కఠినమైన చర్యలు తీసుకోవ దం లేదన్నారు. ఇప్పటికైనా క్లినిక్ సెంటర్లపై త నిఖీ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నడు స్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేస్తున్నామని లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

న్యూస్ రీల్

మహిళ రక్షణపై అవగాహన

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: కడప నగర సమీపంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ క ళాశాలలో కడప శక్తి టీం సబ్ ఇన్స్పెక్టర్ శాంతమ్మ చేత మహిళ సంరక్షణపైన అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళా శాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపా రు. శాంతమ్మ మాట్లాడుతూ సమస్య ఏదైనా వచ్చినప్పుడు ధైర్యంగా ముందుకు సాగాల ని, ఆరోగ్యపరంగా మహిళలు చాలా జాగ్ర త్తగా ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లా డుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుతూ తమ ఆశలను, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, దానిని చేరేందుకు పట్టుద లతో చదవాలని, సమాజం అభివృద్ధి చెం దాలంటే మహిళలు అభివృద్ధి చెందాలని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. అనం తరం విద్యార్థుల అందరి చేత శక్తి యాప్ ఇన్స్టాల్ చేయించారు. మహిళా కోఆర్డినేట ర్ శిరీష, సుభాషిని, పరిమళ కుమారి, నిర్మల, నికిత, స్వరూపారాణి అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీలో తెలుగు భాష అమలుకు చర్యలు తీసుకోవాలి



విశాలాంధ్ర-కడప వైవీయూ: యోగివేమన విశ్వవి ద్యాలయంలో తెలు గు భాష సంపూర్ణంగా అమలుకు చర్యలు తీసుకోవాలని, తెలుగుతల్లి విగ్రం ఏర్పాటు చేయాలని మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులుగానుగపెంట హనుమంతరావు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లం కొండ రాజశేఖర్‌ను కలిసి కోరారు. తెలుగు భాషకు పుట్టినిల్లయిన కడప జిల్లాలో తొలి తెలుగు శాసనం లభించిందని, అయ్యలరా జు రామభద్రుడు. అష్టదిగ్గజ కవులు, వేమ న, అల్లసాని పెద్దన, రామరాజ భూషణుడు, అయ్యల రాజు రామభద్రుడు, కవయిత్రి మొల్ల ఈ జిల్లాలో జన్మించినవారేనని వివ రించారు. విశ్వవిద్యాలయంలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వైవీయూలో మొల్ల జయంతి కా ర్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నం దుకు కృతజ్ఞతలు తెలుపుతూ నిరంతరం కొనసాగించాలని కోరారు.

క్రిటికల్ కేర్ యూనిట్ పనుల పరిశీలన

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: పట్టణం లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు నూతనంగా 23.00 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్ పనులను పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తెలిపిన నియోజకవర్గ టిడిపి యువ నాయకులు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి డాక్టర్లు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉన్నతస్థాయి ఉద్యోగాలు పొందేలా కృషి

విశాలాంధ్ర-పులివెందుల: ఇంజనీరింగ్ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందేందుకు కృషి చేస్తున్నట్లు సర్వజ్ఞ 2కె25 కార్యక్రమం కన్వీనర్ డాక్టర్ మురళీ, కో ఆర్డినేటర్ మహీంద్రారెడ్డి, డాక్టర్ ముని లావణ్యలు తెలిపారు. స్థానిక జెఎన్‌టియు ఇంజనరింగ్ కళాశాలలో కంప్యూటర్స్ సైన్సు డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో సర్వజ్ఞ 2కె25 కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నూతన ఒరవడితో కూడి విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్‌లో ఉన్నతమైన ఉద్యోగాలు పొందేందుకు విద్యార్థులు తీర్చిదిద్దుతున్నామన్నారు.

వెంకటసుబ్బమ్మను పరామర్శించిన తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి బంధువు బొజ్జ వెంకటసుబ్బమ్మ ఇటీవల కాలు విరిగి శస్త్ర చికిత్స చేయించుకుని వేంపల్లిలో స్వగృహంలో ఉన్నారు. ఈ విషయం తెలిసిన తులసి రెడ్డి బొజ్జా వెంకటసుబ్బమ్మను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు .తులసి రెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి ,ఉత్తన్న ,ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు ఉన్నారు.

రేపు 'మహాదాత బుడ్డా వెంగళరెడ్డి' పుస్తక పరిచయ సభ

విశాలాంధ్ర- కడప కలెక్టరేట్: కలియుగ దానకర్ణుడు, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ సభ ఈనెల 19వ తేది ఆదివారం ఉదయం 10.00 గంటలకు కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించనున్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ సభ జరగనుంది. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ అధ్యక్షత జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆత్మీయ అతిథిగా శాసనమండలి సభ్యులు రామచంద్రారెడ్డి పాల్గొనున్నారు. విశిష్ఠ అతిథులుగా బుడ్డా వెంగళరెడ్డి ఐదవ తరం వారసులు బుడ్డా విష్ణువర్దన్‌రెడ్డి, పుస్తక రచయిత కుమ్మరి దస్తగిరి హాజరు కానున్నారు. వీరితో పాటు గౌరవ అతిథులుగా కోదండ రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షులు మోపూరి బాలకృష్ణారెడ్డి, రెడ్డి సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ రంగనాథరెడ్డి, నగర ప్రముఖులు పోతుల వెంకట్రామిరెడ్డి పాల్గొనున్నారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు జీవీ సాయిప్రసాద్ పుస్తక సమీక్ష నిర్వహించనున్నారు.

ఎట్టకేలకు వేంపల్లి రోడ్డుకు మోక్షం కలగడం హర్షనీయం

విశాలాంధ్ర-వేంపల్లి: ఎట్టకేలకు వేంపల్లి రోడ్డుకు మోక్షం కలగడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లిలో రోడ్డు విస్తరణ పనులను తులసి రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. తులసి రెడ్డి మాట్లాడుతూ పులివెందుల ౸వేంపల్లి ౸కడప రోడ్డులో వేంపల్లి పట్టణ పరిధిలో 3.8కిలో మీటర్ల పొడవుతో నాలుగు లైన్ల సిసి రోడ్డు 2023 జూన్ 28న మంజూర అయిందని, 2025 మార్చి 15 నాటికి పనులు పూర్తి కావాల్సి ఉందని అన్నారు. కానీ దురదృష్టవశాత్తు 27శాతం పనులు పూర్తయ్యాక మిగిలిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మొత్తం విలువ 47కోట్ల ఎనిమిది లక్షల రూపాయలు కాగా అందులో 8కోట్ల 17లక్షల ఇరవై ఎనిమిది వేల రూపాయలు ఇప్పటికే కాంట్రాక్టర్కు చెల్లించడం జరిగింది.తర్వాత నిధుల కొరత కారణంగా పనులు నిలుపుదల చేయడం జరిగింది. విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయిన కారణంగా అప్పటికే ఉన్న రోడ్డును త్రవ్వడం జరిగింది. కొత్త రోడ్డు వేయలేదు. దీనివలన అటు వాహనదారులు, బాటసారులు, ప్రజలు గత రెండున్నర సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భూలోకంలో యమలోకం చూస్తున్నారని తులసి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున అనేకసార్లు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది .మిగతా పార్టీలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగింది. పర్యవసానంగా గత రెండు రోజులుగా పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు తదితరులతో కలిసి తులసి రెడ్డి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పునః ప్రారంభం పట్ల హర్షం వెలిబుచ్చుతూ ఈ పనులను శీఘ్రగతిన పూర్తి చేయాలని ,మళ్లీ అర్ధాంతరంగా నిలుపుదల చేయొద్దని, నాణ్యత పాటించాలని తులసి రెడ్డి వారికి విజ్ఞప్తి చేశారు.

రాయలు పాలన స్ఫూర్తిదాకం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: రాయలు పాలన స్ఫూర్తిదాయకమని మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష, అన్నమయ్య జిల్లా పరిశీలకులు సురేష్‌బాబు, ఇన్చార్జ్ మేయర్ ముంతాజ్ బేగం, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డిలు అన్నారు. శుక్రవారం స్థానిక కృష్ణ సర్కిల్ వద్దనున్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద 496 వర్ధంతిని పురస్కరించుకొని, పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు శివశంకర్, శివప్రసాద్, సురేష్, అనిల్‌కుమార్,బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

అదును దాటుతోంది.. విత్తనశనగలు సరఫరా చేయండి

- మంత్రికి కౌన్సిలర్ మహేశ్వరరెడ్డి వినతి

విశాలాంధ్ర-పులివెందుల: అదును దాటుతోంది కానీ ఇంత వరకు విత్తన శనగలు పంపిణీ ఊసేలేదు. ఇప్పటికైనా నాణ్యమైన విత్తన శనగలను సరఫరా చేయాలని మంత్రి అచ్చెన్నాయుడికి కౌన్సిలర్ గంగా మహేశ్వర్‌రెడ్డి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ కడప జిల్లా రైతుల మనోవేదన మంత్రికి అర్థమవుతోందన్నారు. రైతుల సమస్యల గురించి ఆలోచించే సమయం కూటమి ప్రభుత్వానికి ఉందా.. ఎందుకంటే అదును పదును అయిపోయిన తర్వాత విత్తనాలు రైతులకు ఇవ్వడం వల్ల ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. ఇంత వరకు బుడ్డ శనిగలు గురించి గానీ రైతు సమస్యల గురించి గానీ ఏ మాత్రం పట్టించుకోని ఈ కూటం ప్రభుత్వాన్ని ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. ఎంతసేపు పబ్లిసిటీ ఆర్భాటాలు తప్ప రైతుల గురించి ఆలోచించే మనసు కానీ హృదయంగానే ఈ ప్రభుత్వానికి లేదని ప్రజలకు అర్థమైందన్నారు. ఇప్పటికైనా విత్తనశనగలు ప్రభుత్వం తరపున రైతులకు సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. విత్తన శనగల గురించి ప్రభుత్వాన్ని అడిగే దమ్ము, ధైర్యం టిడిపి నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని అడిగేవారు కరువవడంతోనే విత్తనశనగల పంపిణీలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా విత్తనశనగలకు అందించాలని డిమాండ్ చేశారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-వల్లూరు: మండలాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు గంగయ్య ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ మండల అధికారులు పూర్తి అవగాహనతో సమావేశానికి హాజరు కావాలన్నారు. అధికారులు మండల వ్యాప్తంగా ప్రజలు సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేయాలన్నారు. అగ్రికల్చర్ అధికారి రైతులకు పండించే పంటలకు పూర్తి అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మరలా జరిగే సాధారణ సర్వసభ సమావేశానికి అధికారులందరూ ఖచ్చితంగా పూర్తి అవగాహనతో హాజరు కావాలన్నారు. తహశీల్దార్ శ్రీవాణి, ఎంపిడివో రఘురాం, డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్, మండల సొసైటీ బ్యాంక్ చైర్మెన్ లేబాక నాగేశ్వర్ రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫోల్డ్ స్కోప్‌పై వర్క్ షాప్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సబిత, డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫోల్డ్ స్కోప్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కార్యక్రమ అధ్యక్షులుగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యూల్ డేవిడ్ రాజ్ వ్యవహరించగా పరిచయ కర్తగా పర్వీన్, ముఖ్యఅతిథిగా శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ ప్రదీప్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ వర్క్ షాప్‌లో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, అధ్యాపకులు సులోచన, వెంకట రావు, యంబడి ఈశ్వరయ్య, శ్రీధర మూర్తి, శోభన్ బాబు రవిచంద్ర, నరసింహ రెడ్డి, కళ్యాణ్ కుమార్, మల్లిఖార్జున, హరిబాబు, నగేష్, అధ్యాపకేతర సిబ్బంది, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల పట్ల నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర-సిద్ధవటం: దోమల నియంత్రణ కొరకై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పి కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ రంగ లక్ష్మి ఆధ్వర్యంలో సిద్ధవటం మండలంలోని సంటి గారి పల్లె గ్రామంలో శుక్రవారం దోమలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ, లక్ష్మీ నరసమ్మ, సూపర్వైజర్, మౌలాలి, హెల్త్ అసిస్టెంట్, జి వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు ఆదిలక్ష్మి, కృష్ణమ్మ, అంగన్వాడి వర్కర్లు, ఆశ వర్కర్లు, 104 వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

త్వరలో రైతులకు రాయితీపై విత్తన శనగలు

విశాలాంధ్ర-పులివెందుల: రబీ దిశగా సాగు చేసుకునే రైతులకు త్వరలో రాయితీపై రైతు లకు విత్తన శనగలను పంపిణీ చేస్తామని పులివెందుల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గడ్డ ం అమర్‌నాథ్‌యాదవ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ రబీలో రైతులు పప్పుశనగను ప్రధాన పంటగా సాగు చేస్తార న్నారు. అదును పదును కలిసిరావడంతో బు డ్డశనగ సాగుకు రైతులు సిద్దంగా ఉన్నార న్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా రాయితీపై విత్తన శనగలు అందించేందుకు సి ద్ధంగా ఉన్నారన్నారు. బహుశా మూడు లేదా నాలుగు రోజుల్లో పులివెందులకు చేరే అవ కాశం ఉందన్నారు. ఈ విషయం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడితో టిడిపి ఇన్ చార్జి బిటెక్ రవి ఫోన్ ద్వారా సంప్రదించారన్నారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించి త్వరలో విత్తన శనగలను సరఫరా చేస్తామని మంత్రి హామీనిచ్చినట్ల బిటెక్ రవి చెప్పినట్లు అమర్‌నాథ్ వెల్లడించారు.

ఓఎస్ఆర్ ఆదాయాల వనరులపై అవగాహన

విశాలాంధ్ర-గాలివీడు: గ్రామ పంచాయతీల స్వీయ ఆదాయ వనరులను పెంపొందించడంపై అవగాహన సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో 17, 18 వతేదీల్లో రెండు రోజుల పాటు మండల ప్రాజెక్టు అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓఎస్ ఆర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల స్వీయ ఆదాయ వనరులను పెంపొందించడం, ఆస్తుల నిర్వహణ, భూముల లీజు విధానాలు, బజార్ల నిర్వహణ, పన్నులు వసూలు, టోల్ ఫీజు, వాణిజ్య భవనాల అద్దెలు వంటివి సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి మండలం తాళ్లపల్లె పీహెచ్‌సీ పరిధిలోని వేంపల్లి 1,4 అంగన్ సెంటరులో శుక్రవారం లింగా నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీవున్నిసా బేగం గర్భస్థ పిండ నిరోదక చట్టం గురించి వివరించారు. షఫీవున్నీసా మాట్లాడుతూ సమాజములో మగ పిల్లల మక్కువవలన ఆడపిల్ల ను పెంచలేకపోవడం వలన లేక అజ్ఞానం, మూఢ నమ్మకాల వలన ఆడ పిల్లలను గర్భస్థ పిండ దశలోనే అంతమొందిస్తున్నారన్నారు. లింగనిర్ధారణ నిరోదక చట్టం ప్రకారం 1994 అంటే గర్భస్థ పిండ పరిక్షలు, లింగ నిర్ధారణ నివారణ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. గర్భస్థ పిండ పరిక్ష చేయించే వారికి, ప్రోత్సహించిన వారికి 3 సం. జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తారన్నారు.

అన్నం పెట్టడం మహా పుణ్యకార్యం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం, అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే భావనతో, కడప రిమ్స్ నందు ప్రతి, మంగళవారం, శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాం అని కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మహా పుణ్యకార్యం అన్నారు. నవంబర్ 2020లో తండ్రి మరణించారని, వారి జ్ఞాపకార్థం 2024 నవంబర్ నుంచి అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నాం అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కెఎస్ఆర్ఎం కాలేజ్ కరస్పాండెంట్, ట్రెజరెర్ కందుల రాజేశ్వరీ, ఛైర్మెన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, కందుల విద్యా సంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి పాల్గొని భోజన పొట్లాలు పంచారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీ చట్టం ఆధారంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు జూన్ నెలలో ముగిసినప్పటికీ కొన్ని వేల మంది ఉపాధ్యాయులు ఇప్పటికీ రిలీవర్లు లేక ఆవేదనతో ఎదురుచూస్తున్నరని వారందరిని బదిలీ పొందిన పాఠశాలలకు రిలీవ్ చేయాలని ఎస్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టియు సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ 2025 డీఎస్సీ నూతన ఉపాధ్యాయుల నియామకాల అనంతరం అయినా బదిలీలు పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశించాం అయినప్పటికీ నూతన ఉపాధ్యాయుల కొరకు ప్రకటించిన ఖాళీల వివరాల తర్వాత జూన్ నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులు పాత పాఠశాల నుంచి రిలీవ్ అవుతారనే ఆశలు నిరాశలు అయ్యాయి. కాబట్టి నూతన ఉపాధ్యాయుల నియామకాల తర్వాత ఈ బదిలీ ఉపాధ్యాయులను పాత పాఠశాలల నుంచి రిలీవ్ అయ్యేలా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అందులో భాగంగా అకడమిక్ ఇన్స్పెక్టర్లను నియమించాలని అన్నారు. అదేవిధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో 9600 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుకు అంగీకరించిన ప్రభుత్వం తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలనే సమున్నత లక్ష్యం గతి తప్పిందని చాలా మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారని కాబట్టి అనుకున్న లక్ష్యాలు నెరవేరాలంటే మోడల్ ప్రైమరీకి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతున్నాము. ప్లస్ టు పాఠశాలల్లో పరిస్థితుల గురించి ఇదివరకే ప్రభుత్వాన్ని అనేకసార్లు ప్రాతినిధ్యం చేసి ఉన్నప్పటికీ ఇంతవరకు దాని పరిష్కారం చూపలేదు అన్నారు. అలాగే రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో హై స్కూల్ ప్లస్ నందు వందలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇలాంటి పరిస్థితులలో క్వాలిటీ ఎడ్యుకేషన్ ఏ విధంగా సాధ్యమవుతుందో ఆలోచించాలని, స్కూల్స్‌లో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ రెడ్డి ఎస్టియు రాష్ట్ర నాయకులు కే.సురేష్ బాబు, కే బాలగంగి రెడ్డి, కొండాపురం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి యుగంధర్ రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డ్ ఉన్న వారికి ఈ-కేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర-సంబేపల్లె: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబు కార్డు ఉన్న ప్రతి కుటుంబం ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీవో రెడ్డి జవహర్ తెలిపారు. శుక్రవారం రెడ్డివారిపల్లి గ్రామం కొత్తపల్లెలో ఈకేవైసీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం. శ్రామికులందరూ తమ జాబ్ కార్డులో అందరి పేర్లను తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఒకవేళ ఈకేవైసీ చేయించుకోకపోతే మీ జాబ్ కార్డు చెల్లుబాటు కాదని, ఉపాధి హామీ పని కల్పించడం వీలుకాదన్నారు. ఉపాధిలో అక్రమాలకు చోటు లేకుండా ఈ పద్ధతి ద్వారా పనులు కల్పించడం జరుగుతుందన్నారు.

మానవతా విలువలు పెంచుతూ హెల్పింగ్ మైండ్స్ సేవలు

విశాలాంధ్ర-మదనపల్లె: బీహార్ కు చెందిన కూలి పనులు చేసుకునే వ్యక్తి మరణించడంతో మదనపల్లి వన్ టౌన్ పోలీస్ శాఖ వారు అతని మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. అతని కుటుంబ సంబంధికులు ఎవరు ముందుకు రాకపోవడంతో హెల్పింగ్ మైండ్స్ బృందానికి సమాచారం అందించగా, అతని దహన సంస్కారాలు హిందు సాంప్రదాయ బద్ధంగా, హిందు స్మశాన వాటికలో నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్, సంస్థ సభ్యులు కమ్మల ఆనంద్, సమీర్, నవీన్ ఆర్.ఆర్ అంబులెన్స్ సుబ్బు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్మన్ కొడవలిపై ఆరోపణలు అవాస్తవం

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె మాజీ మున్సిపల్ చైర్మన్ కొడవలి శివప్రసాద్ పై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లి జిల్లా ప్రకటన రాబోతున్న నేపథ్యంలో భూముల విలువ అమాంతం పెరిగిపోవడంతో కబ్జాదారుల కన్ను ఖాళీ భూములపై పడిందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కొడవలి శివప్రసాద్ కు చిప్పిలి గ్రామ పరిధిలోని సురభి కాలనీ వద్ద సర్వే నెంబర్ 215/6 లో భూమి ఉందన్నారు. పక్క భూమి యజమాని అయిన కోటకొండ మోహన్ మురళి అలియాస్ జిలేబి మోహన్ అనే వ్యక్తి కొడవలి శివప్రసాద్ కు చెందిన భూమిని కొంతమేర ఆక్రమించడమే కాకుండా కొడవలి శివప్రసాద్ తనను చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని అటు పోలీసులను, ఇటు మీడియాను తప్పుదోవ పట్టించాడన్నారు. ఈ విషయంపై తెలుగుదేశం పార్టీ నాయకులు డీఎస్పీ మహేంద్రను కలువగా సదరు సర్వే నెంబరును పరిశీలించి వాస్తవాలను గుర్తించాలని రెవెన్యూ వారిని ఆదేశించారన్నారు. దీంతో పంచాయతీ సర్వేయర్ సదరు భూమిని సర్వే చేయగా జిలేబి మోహన్ అనే వ్యక్తి కొడవలి శివప్రసాద్ భూమిని కొంతమేర ఆక్రమించినట్లు గుర్తించి, నివేదికను డిఎస్పికి అందజేశారన్నారు. దీంతో తాలూకా పోలీసులు కోటకొండ మోహన్ మురళిపై కేసు నమోదు చేశారన్నారు. అయితే కొంతమంది కొడవలి శివప్రసాద్ పై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. తెలుగుదేశం పార్టీ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలను సహించదన్నారు. అలాంటివాటికి పాల్పడితే సొంత పార్టీ వారినైనా ఉపేక్షించే ప్రసక్తే ఉండదన్నారు. ఈ సమావేశంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, జనార్దన్ రెడ్డి, చిన్నం రాజశేఖర్, శ్రీనివాసులు, నరసింహులు, పిల్లి రవి, శివకృష్ణ, వెంకటరమణ, వేణు గోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సోహెల్ అహ్మద్‌ను సన్మానించిన వైసిపి నాయకులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: కడప నగరంలోని డాక్టర్ ఖలీల్ భాషా హాస్పిటల్ నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన సందర్భంగా శుక్రవారం డాక్టర్ సోహెల్ అహ్మద్‌ను కడప నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్ కార్పోరేటర్లు శంషీర్ పోలిషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ పాక సురేష్ కుమార్ ఫయజ్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ సోహెల్ అహ్మద్ ప్రజాసేవ చేస్తూ ఎంతోమంది పేదలకు వైద్యం అందించారని గుర్తు చేశారు. పేదలకు వైద్యం అందించడమే కాకుండా రాజకీయంగా రంగ ప్రవేశం చేసి వైసిపీలో మంచి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడని తెలిపారు. పార్టీలో ఈయన సేవలను గుర్తించి మా నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. అనంతరం సోహెల్ అహ్మద్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన మా నాయకుడు జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞుడనై ఉంటానని తెలిపారు. పార్టీ ఏ పులిపిచ్చిన ముందుండి ప్రజా క్షేమం కోసం పాటుపడతానని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల ముందు పెట్టేందుకు వెనుకడపోనని తెలిపారు. ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

మిట్స్‌లో సెక్యూరిటీస్ మార్కెట్‌పై వర్క్‌షాప్

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) డీమ్డ్ టు బీ యూనివర్సిటీ లోని స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ విభాగం వారు కోటక్ సెక్యూరిటీస్ వారి సహకారంతో "యువ పౌరుల ఆర్థిక విద్య మరియు సెక్యూరిటీస్ మార్కెట్ అనే అంశంపై రెండు రోజుల పాటు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.నాగార్జున, సెక్యూరిటీస్ మార్కెట్ ట్రైనర్, ముంబై పాల్గొన్నారు. కార్యక్ర మంలో నాగార్జున మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆర్థిక అంశాల ను పెంపొందించడం మరియు సెక్యూరిటీస్ మార్కెట్ (పెట్టుబడి మార్కెట్) గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టాక్ మార్కెట్, బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్, షేర్లు వంటి పెట్టుబడి సాధనాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీన్, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ డాక్టర్ భానుశ్రీ రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ ఈ.జ్ఞానప్రసూన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా 'భూపేష్' జన్మదిన వేడుక..

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: యువ నేత, జమ్మలమడుగు నియోజక వర్గ టిడిపి బాధ్యతలు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి జన్మదిన వేడుక శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జమ్మలమడుగు, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటయ్యాయి. కూటమి కార్యకర్తలు రక్తదానం చేసేందుకు ఉత్సాహం ప్రదర్శించారు. అనాధ శరణాలయాల్లో అన్నదానాలతో పాటు ఆసుపత్రులలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల భూపేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కేకులు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బాణాసంచా పేలుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన వాహనం నియోజకవర్గంలో సంచరించి చూపరులను ఆకట్టుకుంది. ఎర్రగుంట్ల కూటమి కార్యాలయంలో తొలుత భారీ కేక్ కట్ చేసి భూపేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మెగా రక్తదాన శిబిరాన్ని కూటమి మండల పర్యవేక్షకులు తప్పెట్ల మధుసూదన్ రెడ్డి ప్రారంభించగా కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఆర్ నాగరాజు, టిడిపి మండల, పట్టణ బాధ్యులు మాలెపాడు మోహన్ రెడ్డి, సంజీవరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాలు నాగరితకు ప్రతీకలు

విశాలాంధ్ర-రామాపురం: ఆలయాలు నాగరితకు ప్రతీకలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రామాపురం మండలం సుద్దమల్ల గ్రామం దేవలంపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ పూజలలో ఆయన పాల్గొన్నారు. పూజలకు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డి ని గ్రామస్తులు స్వాగతం పలికి వారిచేత ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాదాలు అందచేసి దుస్సాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సీతారాముల ఆలయాన్ని గ్రామస్తులు, దాతలు సమిష్టిగా నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. సీతారాముల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, వర్షాలు సంవృద్ధిగా కురవాలని వారు ఆకాంక్షించారు.

ఆదాయ వనరులను అన్వేషించాలి..

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభ భవనంలో శుక్రవారం గ్రామ సర్పంచులు, సచివాలయాల డిజిటల్, ఇంజనీరింగ్ సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో రంతుల్లయ్య గ్రామపంచాయతీల్లో ఆదాయ వనరులను అన్వేషించి తద్వారా సమకూరు ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆదాయ సృష్టిపై వారు సలహాలు, సూచనలు ఇచ్చారు. వీరికి ఓఎస్ఆర్‌పై శిక్షణ ఇచ్చారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదాయ వనరులపై శిక్షణ కార్యక్రమాలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల వారీగా అభివృద్ధిపైన డిజిటల్ సొంతవన రుల ఆదాయంపై రెండు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి, రామచంద్రారెడ్డి పేర్కొన్నా రు. అందులో భాగంగానే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు, సచివాలయం సిబ్బంది సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీ పురోగతి సాధించాలని శిక్షణ తరగతులు ప్రతి పంచాయతీలో సొంత మూల ఆదాయాన్ని పెంచుకొని నీటి సరఫరా చార్జీలు మార్కెట్ ఫీజులు మొదలైన వాటి నుండి వచ్చే ఆదాయన్ని గణనీయంగా పెంచుకోవాలన్నారు. డిజిటల్ గ్రామాల ను తీర్చిదిద్దాలని ప్రతి పంచాయతీ కార్యదర్శి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు సిబ్బంది సహాయ సహకారాలు ఎంతో అవసరమని పారిశు ద్ధ్యంపైన ప్రత్యేకంగా దృష్టి సాధించాలన్నారు. అందులో భాగంగానే మొదటి రోజుగా శిక్షణ తరగతులను ప్రారంభించామని రేపు కూడా శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గంపా వెంకటసుబ్బయ్య, టిటిటి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిబోయిన వారి వివాహ వేడుక..

నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే చైతన్య..

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: నడిపూరుకు చెందిన భూస్వామి, సీనియర్ రాజకీయ నాయకులు వేణుగోపాల్ (గోపి) సోదరుడైన మురళీకృష్ణ, రజనీకృష్ణ దంపతుల కుమార్తె దేదీప్య వివాహ వేడుక శుక్రవారం ఇక్కడ ఘనంగా జరిగింది. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డితో పాటు పలువురు నేతలు నూతన వధూవరులైన దేదీప్య, శ్రీనివాస్ దంపతులను ఆశీర్వదించారు. గోపి ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, పుత్తా చైతన్య రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి సి భూపేష్ రెడ్డి వర్గీయులుగా కొనసాగుతుండటం, మురళీకృష్ణ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, రజి నీకృష్ణ ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలిగా పని చేస్తుండడంతో వివాహ వేడుకకు రాజకీయ రంగ ప్రముఖులు, వాణిజ్య, వ్యాపార, విద్యావేత్తలు, అధ్యాపక, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు, పట్టణ ప్రము ఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గోపి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, హితులు, సన్నిహితులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు వేడుకకు హాజరై వసతులను పర్యవేక్షించారు.

నిందితున్ని శిక్షించాలంటూ ధర్నా

విశాలాంధ్ర-రామసముద్రం: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి బిఆర్ గవాయ్ పై విచక్షణ రహితంగా ప్రవర్తించిన లాయర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఒక లాయర్ గా ఉండి భారత ప్రధాన న్యాయమూర్తి పైనే అనుచితంగా ప్రవర్తించడం ఎంతవరకు సబ బని ప్రశ్నించారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించి మరొకరు ఇలా ప్రవర్తించకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే రాజ్యాంగంపై ప్రజల్లో నమ్మకం పోతుందని పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగాధర్ రాజేష్ రవీంద్ర కొండప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకుల దృష్టికి కార్మికుల సమస్యలు

విశాలాంధ్ర-మదనపల్లె: అక్టోబర్ 17,18 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలో జరుగుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశాల్లో పాల్గొని అన్నమయ్య జిల్లాలోని కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుల దృష్టికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్ సాంబశివ, జిల్లా ఉపాధ్యక్షుడు పోకూరు మురళి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కార్మిక సమస్యలపై ప్రభుత్వ వైఫల్యాలపై ఎలాంటి నిరసనలు, ఆందోళనలు చేపట్టాలన్న 24 గంటల ముందు పోలీసుల అనుమతి తీసుకోవాలని కార్మికోద్యమాలపై పెడుతున్న నిబంధనలు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రి, డీజీపీ దృష్టికి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు తీసుకు పోవాలని కోరారు. జిల్లాలో కార్మికుల పరిస్థితి మాత్రం దుర్భరంగా ఉందని ప్రభుత్వ రంగంలో కాంట్రాక్టు, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కనీస వేతనాలు, భద్రత, లేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. పారిశుద్ధ్య, నిర్మాణ, కూలీ, అంగన్వాడీ, హోమ్ గార్డ్, హాస్పిటల్, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరిపించాలని, నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ప్రయోజనాలు అందించాలని, కార్మికులపై జరిగే నిర్లక్ష్య మరణాలపై నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికుల వయస్సు ఆధారంగా తొలగింపులను నిలిపివేయాలని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడి జిల్లాలో కార్మిక సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

సిపిఐ మండల కార్యదర్శి ప్రభాకర్

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని నాగిశెట్టిపల్లి గ్రామపంచాయతీలో ప్రభుత్వ భూము లను ఆక్రమించి అమ్మి సొమ్ము చేసుకుంటున్న భూ అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బి.మఠం మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నాగశెట్టిపల్లె రెవెన్యూ పొలము జాతీయ రహదారి పక్కన ఆక్రమణకు గురైన భూమిని సీపీఐ బృందం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం మండలంలోని నాగిశెట్టిపల్లి గ్రామపంచాయతీ నందు జాతీయ రహదారి పక్కన సర్వేనెంబర్ 43 నందు కొంతమంది భూ కబ్జాదారులు ప్రభుత్వ భూమికి దొంగ రికార్డులు సృష్టించి భూఆక్రమణలు చేసి ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారని ఆయన అన్నారు. సర్వేనెంబర్ 41 నుండి కల్వర్టునుండి వంకనీరు వస్తాయని ఆ వంక ద్వారా సర్వేనెంబర్ 43 నందు నీరు నిల్వ ఉంచేందుకు ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చెక్ డ్యాము ను నిర్మించడం జరిగింది. భూ కబ్జాదారులు చెక్ డ్యామును సైతం పగలగొట్టి మొత్తం మట్టి తోలి ప్లాట్లు వేసి అమ్మి సొమ్ము చేసుకునేందుకు కబ్జాకు పాల్పడుతున్నారు. రెవెన్యూ అధికారులు సర్వేనెంబర్ 43 మరియు 424 నందు ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు సోమిరెడ్డి పల్లె నారాయణ, చేజర్ల రవి, నాయకులు నాగిపోగు రాజన్న, ఏఐవైఎఫ్ ఏరియా నాయకులు సుజన్ కుమార్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణ ప్రజలందరి బాధ్యత

విశాలాంధ్ర-బద్వేలు: నియోజకవర్గ పరిధిలో గోపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శు క్రవారం గోపవరం, శ్రీనివాసాపురం గ్రామాలల్లో, ప్రాథమిక పాఠశాల యందు, విద్యార్థిని విద్యార్థులకు, దోమలద్వారా వ్యాపించు, జ్వారాలు, మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, మెదడు వాపు గురించి, తెలియజేశారు. గోపవరం, శ్రీనివాసాపురం గ్రామములో, ఫ్రైడే డ్రైడే, కార్యక్రమం నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలచే, ఇంటింటి లార్వా, ఫీవర్, సర్వే చేయించి, ప్రజలకు దోమ కాటు ద్వారా, కలుగువ్యాధుల గురించి ప్రజలకు, గ్రూప్ మీటింగ్ ద్వారా, అవగాహనా కల్పించారు. దోమకాటుకు గురికా కుండా ప్రజలు అందరుకూడా దోమ తెరలు వాడాలని టి.నరసింహ రెడ్డి, ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, గౌస్ బాషా, హెల్త్ అసిస్టెంట్, ఖాసిం, ఆశా కార్యకర్తలు, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడిని ఖండిద్దాం రండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ 19వ తేది ఆదివారం ఉదయం 10 గంటలకు బీసీ భవన్ లో కడప జిల్లా పౌర సమాజం ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ప్రముఖ లాయర్ ఏ.సంపత్ కుమార్ సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ డాక్టర్ మల్లెల భాస్కర్ ఐలు నాయకులు సుబ్రహ్మణ్యం సిపిఐ సిపిఎం నగర కార్యదర్శులు ఎన్ వెంకట శివ, రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అత్యంత దయనీయంగా మారుస్తూ దేశంలో అత్యున్నతమైన న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి పైన దాడి చేయడం వెనుక మతోన్మాదుల ఆలోచన దృక్పథంతోనే జరిగిందన్నారు. ఈ సదస్సుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్ మరియు జన విజ్ఞాన వేదిక ఫౌండర్ డాక్టర్ బ్రహ్మారెడ్డి ముఖ్యమైన వక్తలుగా పాల్గొని ఉపన్యాసాలు ఇస్తారని తెలిపారు. విద్యావంతులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు మేధావులు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాతంత్ర శక్తులు అభ్యుదయ కాముకులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విధులకు హాజరు కాని వెటర్నరీ డాక్టర్లను సస్పెండ్ చేయాలి

ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు మునిరత్నం డిమాండ్

విశాలాంధ్ర-బద్వేలు: మండలంలోని చెన్నకేశంపల్లెలో వెటర్నరీ డాక్టర్గా పనిచేస్తున్న లక్ష్మీనరసయ్య సరిగా విధులకు రాకుండా ప్రజలకు సరిగా స్పందించకుండా కొన్ని వందల మూగ జీవాల మృతికి కారణమయ్యాడని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు మునిరత్నం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ బద్వేలు మండలంలోని చెన్నకేశంపల్లి తిరువెంగళపురం ఇంకా పలు గ్రామాల్లో వెటర్నరీ డాక్టర్లుగా పనిచేస్తున్న ఎం.లక్ష్మీనరసయ్య, పవన్ కుమార్లు విధులకు రాకుండా పశువైద్యశాలలకు తాళాలు వేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్న వెటర్నరీ డాక్టర్లను సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని గత పది రోజులుగా వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ పశువైద్యశాల ఏడి విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వెంటనే చెన్నకేశవపల్లె తిరువెంగళపురం రెండు గ్రామాల పశువైద్యశాలలను సందర్శించి గ్రామ ప్రజలతో చర్చించి విధుల పట్ల నిర్లక్ష్యం వహించి మూగజీవాల చావుకు కారణమైన డాక్టర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఉదయ్, వెంకటల్ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడులను ఆపాలి

ఏపీయూడబ్ల్యుజే యూనియన్ అధ్యక్షులు వెంకటేష్ సుదర్శన్ రెడ్డి జాని

విశాలాంధ్ర-బద్వేలు: సోదాల పేరుతో పోలీసులు పత్రిక స్వేచ్ఛపై చేస్తున్న దాడులను ఆపాలని బద్వేల్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజా సంఘాలవారు కోరారు. శు క్రవారం బద్వేల్ ఆర్డీవో కార్యాలయం లో సీసీకి వినతి పత్రాన్ని అందజే శారు. సాక్షి హైదరాబాద్ కార్యాలయం పై సోదాల పేరుతో దాడులు చేయడం, ఎడిటర్ ధనుంజయ రెడ్డికి, నెల్లూరు బ్యూరోకు నోటీసులు ఇవ్వడాన్ని ఈ సందర్భంగా విలేకరులు ఖండించారు. ప్రజాస్వామ్యంలో పత్రికలు, న్యూస్ ఛానళ్లు ప్రజా సమస్యలపై ఎంతో బాధ్యతతో పనిచేస్తున్నాయని ఈ సందర్భంగా విలేకరులు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వాలు తమ తప్పులను ప్రజలకు తెలిసేలా బహిర్గతం చేస్తున్నాయనే అక్కసుతో తప్పుడు కేసులు బనాయించడం, సోదాల పేరుతో దాడులు చేయడం, నోటీసులు ఇచ్చి బెదిరించడం శోచనీయమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేవేనని తెలిపారు. ఇప్పటికైనా పత్రికా స్వేచ్ఛపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ కృష్ణ, శేఖర్ రెడ్డి, రాజా,రఘు రామిరెడ్డి, రవి వెంకటేష్, వి.వి, రమణ, అరుణ్, అనిల్, బాలు, రహీం, కిషోర్, నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వ సాధారణం

విశాలాంధ్ర-కలసపాడు: ప్రభుత్వంలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వ సాధారణమని ఎంఇవో ఎస్.మస్తాన్ వలీ ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణా రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాజుపాలెం గ్రామం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయు లుగా పని చేస్తూ మరో చోటికి బదిలీ పై వెళ్ళిన ఉపాధ్యాయు సి.వెంకటరెడ్డి, కె.వెంకటసుబ్బారెడ్డిలకు ప్రధానోపాధ్యాయుడు రంగనాయకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో వారికి శుక్రవారం ఘనంగా సన్మానం జరిగింది. సన్మాన గ్రహీతలు వెంకటరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తుల సహకారం, చూపిన

అభిమానం మరువలేనిదన్నారు. ముఖ్యంగా కాంట్రాక్టర్ పోకల మల్లికార్జునరెడ్డి పాఠశాలకు సహకారం అందించడంలో తమకు ఎప్పుడు అండగా నిలిచే వారన్నారు. ఎస్ఎంసి చైర్మన్ కరీముల్లా, గ్రామపెద్దలు పోకల రామకృష్ణారెడ్డి, పోకల సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు రమణయ్య రవి ప్రతాపరెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి, నాగిరెడ్డి, శేఖర్ బాబు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య డిగ్రీ కాలేజ్ విద్యార్థుల సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - పులివెందుల : పులివెందుల పట్టణంలో వెలిసియున్న ఎంతో పురాతనమైన రంగనాథ స్వామి దేవాలయ ప్రాంగణంలో చైతన్య డిగ్రీ కాలేజ్ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేశారు. దేవాలయంలో చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాలను గత రెండు రోజులుగా చైతన్య డిగ్రీ కాలేజ్ కరెస్పాండెంట్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛందంగా పనులు చేశారు. అలాగే జెసిబిల సహాయంతో, అక్కడ ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం చైతన్య డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, ప్రొద్దుటూరు గుడి బిబడి సేవా సంఘం ఆర్గనైజింగ్ సుప్రజ, వెంకటసుబ్బారెడ్డి,మరియు సభ్యులు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి అక్కడ ఉన్న చెత్తాచెదరాలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుత ఈ దేవస్థానంలో పిచ్చి మొక్కలు వేపుగా పెరిగి ఉండడంతో వాటిని తొలగించాలన్న ఆలోచన కలగడంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ పిచ్చి మొక్కలను తొలగించిన ప్రాంతంలో మామిడి మొక్కలు దాతల సహాయంతో నాటడం జరుగుతుందన్నారు. అదేవిధంగా దేవాలయం ప్రహరీ గోడ చుట్టూ పూల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు ఆలయ చైర్మన్ చింతకుంట సుధీర్ రెడ్డి, ఈవో రమణలు మాకు ఎంతో తోడ్పాటు అందించడం జరిగిందన్నారు.

ఎన్ఎస్ఎస్ రెండవ రోజు ప్లాంటేషన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ, విద్యార్థులతో రెండవ రోజు చెట్లు నాటే కార్యక్రమం కడప నగరం నందు రైల్వే కాలనీ మేరీ నగర్‌లో గల ప్రైమరీ ఎలిమెంటరీ పాఠశాలలో చెట్లు నాటడం జరిగినదని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ చెప్పలి రాజారావు అన్నారు. శుక్రవారం ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చెట్లు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగినది. ప్లాంటేషన్ అనే పదానికి అర్థం లేదా చెట్లు నాటకమని అంటారు మన పర్యావరణాన్ని కాపాడటానికి వృక్షారూపణ అవసరము పాఠశాలలో విద్యార్థులు చెట్లు నాటడం, అరణ్య వృక్షరూపణ వనరక్ష మన జీవితానికి ఆవశ్యకతమైనవి అవి మనకు ఆక్సిజన్, ఆహారము, నీడ, ఇంధనము, వర్షాలు కలిగిస్తాయి చెట్లు లేకుండా భూమిపై జీవము ఉండదు ప్రతి మనిషి కనీసం ఒక చెట్టును నాటాలి చెట్లు నాటడమే కాకుండా వాటిని రక్షించాలి. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల హెడ్ మాస్టర్ పాల్గొన్నారు.

జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వేణుగోపాల్

విశాలాంధ్ర -అట్లూరు : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని అందుకోసం సుప్రీం కోర్టులో ప్రజాస్వామికవాదులుగా గుర్తించబడ్డ సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని శుక్రవారం అట్లూరు మండలం తహసిల్దార్ కార్యాలం లో డిప్యూటీ తహసిల్దార్ శిరీష కి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండూరు వేణుగోపాల్ మరియు ఎం ఎస్ పి అధ్యక్షుడు చాట్ల జయన్న చేతుల మీదుగా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో అట్లూరు సర్పంచ్ భర్త అట్లూరు సుబ్బారాయుడు, వరికుంట గోపాలయ్య, గంపలు మునెయ్య, గొల్లపల్లి జయరాములు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే బస్సుయాత్రను విజయవంతం చేయండి

ఏఐఎస్ఎఫ్ కడప జిల్లా సహాయ కార్యదర్శి బత్తల పీటర్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఈ నెల 22 నుండి నవంబర్ 12 వరకు జరగనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అద్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కడప జిల్లా సహాయ కార్యదర్శి బత్తల పీటర్ మాట్లాడుతూ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ విద్య ఎడారి ద్రాక్షలా మారిందని అన్నారు. జిల్లాలోని ప్రధాన మండలాలు మరియు నియోజకవర్గ కేంద్రాలలో విద్యార్థులు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ప్రభుత్వ ఐటీఐ లేదా ప్రైవేట్ కళాశాలలలో చదువుతున్నారని మరియు వేల రూపాయలు చెల్లిస్తున్నారని అన్నారు. అనేక పోరాటాల తర్వాత సాధించుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లు, పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరంగా ఉండటం మరియు గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత పెరుగుతుండటం వాస్తవం అని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు సమస్యల కోసం బస్సు యాత్ర కొనసాగిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సంయుక్త కార్యదర్శి నాని మరియు ధనుష్, స్టెఫిన్, తౌసిఫ్ తధితరులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాల్లో కందిపప్పు కరువాయే



విశాలాంధ్ర-అట్లూరు: ప్రభుత్వం చౌకధరల దుకాణాల్లో నిత్యావసర సరుకులు పేదలకందిస్తామని కూటమి ప్రభుత్వం మాటలకే పరిమిత మైంది. దుకాణాల్లో నిత్యావసర సరుకులు అందించకుండా పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. కనీసం దసరా, దీపావళి, పండుగకైనా కంది పప్పు, నిత్యావసర సరుకులు రేషన్ కార్డుదారులకు కందిపప్పుతో పాటు పామాయిల్, గోధుమపిండి, రాగులు, జొన్నలు, పంపిణీ చేయాలని ఆలోచన క్షేత్రస్థాయిలో కార్యాచరణకు నోచు కోవడం లేదు. రేషన్ దుకాణాల దగ్గరకెల్లే సరికి ఆశతో ఎదురు చూస్తున్న పేదలకు నోట్లో వెలక్కాయపడింది. చౌక దుకాణాల్లో చక్కెర కూడా అరకిలో మాత్రమే పంపిణీ చేస్తే పండుగలకు ఏమాత్రం సరిపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వచ్చే నెల నుండి ప్రభుత్వం పేదలకు నిత్యావసర సరుకులు చౌక దుకాణాలోనే అందించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ పంచాయితీ ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: మండలంలోని గ్రామ పంచాయితీల అభివృద్ధికి ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఓ ఆర్ నాగిరెడ్డి సర్పంచులను, పంచాయితీ కార్యదర్శులను,డిజిటల్ అసిస్టెంట్ లను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లను ఆదేశించారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాల యంపైన సమావేశ హాలులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో సమూలంగా మార్పులు తీసుకురావాలన్నారు. పంచాయితీలలో ఇంటి, ఆదాయం,నీటి, వ్యవసాయ భూమి, చిన్న,చిన్న పరిశ్రమలు తదితర వాటిపై పన్నులు వసూలు చేసి పంచాయితీ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు.పన్నుల వసూలుపైన,అభివృద్ధిపైన స్థానికులలో చైతన్యం తీసుకురావాలన్నారు. సమస్యల పరిష్కారంలో కానీ,పన్నులు వసూలులో కానీ స్థానికులను అప్యాయంగా పలకరించినప్పుడు ప్రజల్లో మార్పు వచ్చి అధికారులకు అనుకూలంగా మారతారన్నారు.డిజిటల్ రికార్డ్స్ మెయింటెన్స్ చేయాలన్నారు.గ్రామ పంచాయితీల అభివృద్ధిలో సర్పంచులు,పంచాయితీ సెక్రటరీ ల పాత్ర కీలకం అన్నారు.అందరూ సమన్వయంతో ప్రణాళిక బద్దంగా పని చేసినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించడానికి వీలు ఉంటుందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణకులు దొరబాబు, గంగయ్య,ఇఓ పిఆర్డీ మహేష్, సర్పంచులు, సచివాలయ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు,డిజిటల్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

కూతురంటే భారం కాదు దేవడిచ్చిన వరం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వైఎంఆర్ కాలనీ నందు 'సేవ్ ది గర్ల్ చైల్డ్' కార్యక్రమంలో బాగంగా పీసీ పిఎన్డిటీ యాక్ట్ 1994పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ నల్లబల్లి హిమబిందు మాట్లాడుతూ ఆడపిల్లను రక్షిదాం- ఆడపిల్లను చదివిద్దాం అన్నారు. కూతురంటే కాదు భారం కుటుంబానికి దేవుడు ఇచ్చిన వరం అన్నారు. ఆడ అయినా మగ అయిన పిల్లలు ఇద్దరు ఒక్కటే అని, గర్భశ్రావం తల్లి ప్రాణానికి హానికరం అన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభరాణి మాట్లాడుతూ లింగవివక్షతో గర్భస్రవానికి పాల్పడకండి. పిఎన్డిటీ యాక్ట్ 1994చట్టానికి గురికాకండి. చట్టాన్ని అతిక్రమించి లింగనిర్ధారణ పరీక్షలు చేసినవారికి, చేయించినవారికి, అందుకు సహకరించినవారికి 3నుండి 5సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు 50వేల నుండి లక్ష రూపాయల వరకు జరిమానా విధించ బడుతుందని తెలిపారు. అనంతరం వైఎంఆర్ కాలనీ పురవీదుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్డి సొసైటీ ప్రసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి, సెక్రెటరీ చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, అల్లాబకష్, చంద్ర ఓబుళరెడ్డి, గంగభవాని స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా భూపేష్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కొండాపురం: జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భూపేష్ సుబ్బరామిరెడ్డి జన్మదినం సందర్భంగా కొండాపురం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్ లు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు.అంతే కాక మండల తెలుగుదేశం మహిళా అధ్యక్షరాలు చామల పద్మజ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులతో కలిసి ఘనంగా వేడుకలు చేసారు. ఈ కార్యక్రమం లో రమేష్ రెడ్డి, అరుణ్ రెడ్డి, శంకర్ రెడ్డి, వీర శేఖర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, సాయి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం నందు గల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నందు శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా నందు 21 కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈ జాబ్ మేళాలో జిల్లా వ్యాప్తంగా 525 మంది నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల కరస్పాండెంట్ అరకట వేముల హరినారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా కళాశాల వేదికగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఎక్కడెక్కడి నుంచో కంపెనీలను ఇక్కడికి పిలిపించి ప్రొద్దుటూరు చుట్టుపక్కల పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన చేసేలా చేస్తున్నామని తెలిపారు. కళాశాల డైరెక్టర్ పృథ్వీనారాయణ మాట్లాడుతూ ఫ్రెషర్ గా ప్రారంభ దశలో జీతం తక్కువగానే ఉంటుంది

కానీ నాలుగు సంవత్సరాల వరకు బాగా కష్టపడితే అత్యున్నత స్థానానికి వెళ్ళవచ్చు అని తెలియజేశారు. హెటిరోడ్రగ్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, అల్దిక్సన్, యంగ్ ఇండియా, అపోలో ఫార్మసీ, ఎస్బిఐ కార్డ్స్, టాటా ఎలక్ట్రానిక్స్, పేటీఎం ఇలా 21 కంపెనీలకు సంబంధించిన హెచ్ఆర్లు ఇంటర్వ్యూ నిర్వహించి ఈ జాబ్ మేళా నందు 114 మందిని సెలెక్ట్ చేసుకున్నట్లు కళాశాల కోఆర్డినేటర్ పర్లపాడు గౌరీ శంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్ఎస్ డిసి ద్వారా తమ కళాశాలలో ఏర్పాటు చేసినందుకు శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో దినేష్ మరియు కంపెనీ ల హెచ్ఆర్లు , నిరుద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వధూవరులకు ఆశీస్సులు

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక వాసవి కల్యాణ మండపంలో శుక్రవారం వేముల మండలం గొందిపల్లెకు చెందిన టిడిపి జిల్లా కార్యదర్శి బొజ్జా మైసూరారెడ్డి సోదరుడు శివానందరెడ్డి యశోదల వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డిలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. దీర్ఘాయుష్మాన్భవ అంటూ వారిని దీవించారు.

సుండుపల్లె క్లస్టర్-9కు యల్‌వి రమణ ఏకగ్రీవం

విశాలాంధ్ర-సుండుపల్లె: మండలం క్లస్టర్ -9కు ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్వి రమణ టీడీపీ నాయకులు కార్యకర్తలు హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు. ప్రజల విశ్వాసం,నాయకత్వ నైపుణ్యం, సేవా భావం పట్ల గౌరవ సూచకంగా ఈ ఏకగ్రీవ ఎన్నిక జరగడం నిజంగా గర్వకారణం. ప్రజల అండతో, అభివృద్ధి పట్ల నిబద్ధతతో మీరు ముందుకు సాగి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాం క్షిస్తు న్నామన్నారు. నాయకత్వం క్లస్టర్-9 అభివృద్ధికి, పార్టీ పటి ష్టతకు శక్తివంచలు లేకుండా పనిచేస్తాన న్నారు ప్రజల సంక్షేమానికి మార్గదర్శకంగా నిలుస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.

బ్రహ్మంగారి సన్నిధిలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: జగద్గురు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా బ్రహ్మంగారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పలికి పూలమాలలు, శాలువలతో సన్మానించి బ్రహ్మంగారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. బ్రహ్మంగారి కాలజ్ఞానం జీవిత చరిత్ర గురించి ఆలయ అర్చకులు వివరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు, అదేవిధంగా శ్రీ జగన్మాత ఈశ్వరి దేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ప్రత్యేక స్వాగతం పలికి ఈశ్వరి దేవి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీరి వెంట బిమఠం,ఎస్సై శివప్రసాద్, పోలీస్ సిబ్బంది ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమార్చన

విశాలాంధ్ర-సిద్దవటం: మాధవరం 1 పంచాయతీ బంగారుపేటలో వెలసిన శ్రీ గంగా భవాని అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆశ్వయుజ మాసం శుక్లపక్షం శుక్రవారం పురస్కరించుకుని ఆలయ నిర్వహకులు అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు పుష్పమాలికలతో అత్యంత సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అత్యవసరమైతే ఉగ్గపట్టుకోవాల్సిందే!

- మండలానికి వస్తే ఒకటి ..రెంటికి అవస్థే - నిరుపయోగంగా మారిన శౌచాలయాలు - ఇబ్బంది పడుతున్న మహిళలు, ప్రయాణికులు

విశాలాంధ్ర-సింహాద్రిపురం: ఏదైనా పనిమీద మండలానికి వస్తే ఒకటి, రెంటికి ఇబ్బంది పడాల్సిందే. అత్యవసరమైతే ఉగ్గపట్టుకోవాల్సిందే. మండల కేంద్రంలో మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రయాణికులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా మండల పరిసర గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం ప్రజలు వచ్చివెళుతూంటారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యవసాయ పనిముట్లు, కూరగాయల సంత, నిత్యావసరాల కోనుగోలుకు మండల కేంద్రానికి రావాల్సిందే. అలాంటి పరిస్థితుల్లో శౌచాలయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన శౌచాలయాలు ప్రస్తుతం ఉపయోగంలో లేక ఈ పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా మహిళల పరిస్థితి అత్యంత ఇబ్బందికరంగా మారింది. అలాగే మహిళా ప్రయాణికులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు, వివిధ పనులపై వచ్చేవారు శౌచాలయాలు ఉపయోగంలో ఉగ్గపట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆఫీసులకు అవసరం కోసం వచ్చేవారు కొందరు ఎక్కడో సందు చూసి కానిస్తుండగా, మహిళ పరిస్థితి మాత్రం వరుణతీతంగా మారింది. మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లను నిర్మించాల్సిన ఉందని ప్రజలు వాపోతున్నారు. మండలంలో అసలు సదుపాయాలు ఎక్కడ కనిపించడం లేదు. సింహాదిపురం సెంటర్లో ఉన్న శౌచాలయాలు ఉపయోగం లేకపోవడంతో తీవ్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే శౌచాలయాలు ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం

శౌచాలయాలకు మరమ్మతులు చేపట్టి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. స్థానికంగా బుడ్డయ్యపాలెంలో ఉన్న శౌచాలయాలను వినియోగంలోకి తెస్తాం. అలాగే బస్టాండ్ కోసం ఉన్నత అధికారులకు నివేదికను పంపించాం. తొందర్లోనే వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం.

- వెంకటరాముడు, ఈవోపిఆర్‌డి, సింహాద్రిపురం

ఎరువుల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: కృషి విజ్ఞాన కేంద్రం, ఉటుకూరు ఆధ్వర్యంలో శుక్రవారం ఇప్పపెంట గ్రామంలో జీవన ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెవికె సమన్వయకర్త అంకయ్య కుమార్ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి కోసం విచక్షణ రహితంగా పురుగు మందులు, ఎరువుల వాడకం వలన నేల నిస్సారమై, నీటి, పర్యావరణ కాలుష్యం జరిగి అనేక అనారోగలకు గురి అవుతున్నారని తెలిపారు. అధిక రసాయన ఎరువులు వాడకం వలన భూమిలోని జీవరాశులలో అతి ముఖ్య సముదాయమైన సూక్ష్మ జీవులపై ప్రభావం పడి వాటి సంఖ్య తగ్గుతూ ఇవి జరిపే రసాయన చర్యలపై గణనీయమైన మార్పులు సంతరించుకొనే ప్రభావం ఏర్పడుతుందన్నారు. భూమికి ఉన్న సహజ గుణాలు, ఆరోగ్య పరిస్థితి నానాటికి క్షీణించుటకు దోహద పడుతున్నట్లు వివరించారు. జీవన ఎరువులు సహజ సిద్ధమైనవి. వాటి వలన వాతావరణ కాలుష్యం జరుగదు. పంటకు హాని చేయవన్నారు. వీటి వాడకం ద్వారా రసాయన ఎరువుల మోతాదు కొంత మేర తగ్గును. తక్కువ ఖర్చుతో అధిక ఫలితం పొందవచ్చును. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డా. మహేష్ బాబు,శిల్పకళా, మానస వ్యవసాయ విద్యార్థులు, ఇప్పపెంట రైతులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు బిజెపితోనే సమన్యాయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: అన్ని వర్గాల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం కోరుకుంటున్న తరుణంలో తరతరాలుగా రాష్ట్రంలో కూటమి పాలన కొనసాగగలదని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా కడప నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. బీజేపీ, జగన్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే అపోహలు ఉన్నాయని, అవన్నీ పటపంచాలు చేసే విధంగా సభ జరిగిందన్నారు.

కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు జెంగిటి వెంకటసుబ్బారెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బీరం సుబ్బారెడ్డి, మహిళా నాయకురాలు పద్మావతి బాయ్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీజికి ఘనంగా స్వాగతం పలికిన పోతుగుంట

విశాలాంధ్ర-రాజంపేట: కర్నూలు జిల్లా, మహా పుణ్యక్షేత్రం అయినా శ్రీశైల క్షేత్రానికి గురువారం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం శ్రీశైల క్షేత్రానికి భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచ్చేసిన సందర్భంగా ఆలయ చైర్మన్ గా పోతు గుంట రమేష్ నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి లతో కలిసి వారికి స్వాగతం పలకడం జరిగింది. అనంతరం వారు స్వామివారిలను అమ్మవార్లను ప్రత్యేక అభిషేకం కుంకుమార్చన వేద పండితుల ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. అనంతరం వారు శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించడం జరిగింది.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి రెడ్డి మరియు టిడిపి జిల్లా అధ్యక్షులు టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో శ్రీకృష్ణదేవరాయ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కృష్ణా హాలు కుడలిలోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలతో సత్కరించడం జరిగినదనీ. టిడిపి నగర అధ్యక్షులు, పి మన్సూర్ అలీ ఖాన్ తెలిపారు. వారు మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయలు 1509 నుండి 1529 వరకు విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శక్తివంతమైన పాలన అందించారని ,ఆయన సామ్రాజ్యాన్ని విస్తరించడం, సంస్కృతి, సాహిత్యం యొక్క స్వర్ణయుగాన్ని ప్రోత్సహించడం, నీటిపారుదల వ్యవస్థలు మరియు దేవాలయాలు వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పర్యవేక్షించడం ద్వారా ప్రసిద్ధి, ఆయన పాలన సామ్రాజ్యానికి శ్రేయస్సు, సాంస్కృతిక అభివృద్ధికి ఒక శిఖరంగా ఆయన వ్యవహారించారని అలానే తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన శ్రమ ఎంతో ఉందని, ఆయనని స్మరించుకోవడం ఎంతైనా అవసరం ఉందని ఈరోజు ఆయన 496 వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి విగ్రహానికి పూలమాలతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సత్కరించారు. టిడిపి నగర ఉపాధ్యక్షులు గౌతం, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనం శిలాస్ వెంకటేష్ బాబా ఫక్రుద్దీన్ టిడిపి డివిజన్ ఇన్చార్జులు టిడిపి పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాటలొద్దు.. దమ్ముంటే గెలుచుకో...

- కట్టుదిట్టుమైన భద్రత కల్పించినా డిపాజిట్ దక్కలేదు
- రాబోవు ఎన్నికలు కూడా అదే స్థాయిలో
- నీ సత్తా ఏమిటో చూస్తా
- వైసిపి నేత సతీష్‌రెడ్డికి బిటెక్ రవి సవాల్

విశాలాంధ్ర-పులివెందుల: సొల్లు మాటలొ ద్దు.. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలల్లో తగ్గేదేలేదు.. ఓటమి భయంతో తమపార్టీపై దుష్ప్రచారాలకు తెరలేపారు.. ఇటీవల జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినా వైసిపి అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కలేదు.. రాబోవు స్థానిక సంస్థల కూడా అంతే భద్రత మధ్య జరుగుతాయి.. దమ్ము, ధైర్యం ఉంటే గెలుచుకోమను అంటూ వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డికి టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి సవాల్ విసిరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో నింది తుడిగా ఉన్న వైఎస్ అవినాష్‌రెడ్డికి సతీష్‌రెడ్డి సలహాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లో అధికారపార్టీ నాయకులు నామినేషన్లు వేయనీరని సతీష్‌రెడ్డి ప్రచారం మొదలు పెట్టారన్నారు., కానీ మొన్నటి జడ్పీటీసీ ఉపఎన్నికలో 11మంది అభ్యర్థులు నామినేషన్లు వేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగినా ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి కోరుకున్నట్లుగానే కట్టుదిట్టుమైన పోలీస్ బందోబస్తు మధ్య రెండు చోట్ల రీపోలింగ్ నిర్వహించినా వైసిపికి డిపాజిట్ రాలేదన్నారు. 2024శాజన సభ ఎన్నికల్లో 65 వేల ఓట్లతో పులివెందుల ప్రజలు వైసీపీని గెలిపి ి స్తే.. ఇక్కడ చెత్త ఏరిపారేస్తా అనడం ప్రజల ను అవమానిస్తున్నారన్నారు. 1978 నుంచి ఏదో విధంగా గెలుస్తున్న వైఎస్ కుటుంబానికి సతీష్ రెడ్డి సలహాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. వివేకా హత్య కేసులో నిందితు డుగా ఉన్న ఇంత టిడిపి గాలిలో కూడా అం తో ఇంతో సేవ చేశాడు కాబటి ఎంపీగా అవినాష్ గెలిచారన్నారు. సతీష్ రెడ్డి వైసీపీలోకి రాకముందు వాళ్లకి ఏలాంటి అవమానాలు లేవన్న చర్చ నడుస్తోంది ఆ విషయం సతీష్ తెలుసుకోవాలని హితవు పలికారు. జెడ్పీటీసీ ఎన్నికల ముందు ఎర్రబల్లె చెరువుకు నీరు తెప్పిస్తామని హామీనిచ్చామని, గెలిచిన అనంతం హామీని నిలుపుకున్నామన్నారు. దీంతో గొట్టపు బోర్లలో నీరు సమృద్ధిగా ఉందన్నారు. కొండారెడ్డి చెరువు నిండితే ఇక పులివెందులకు కూడా నీరందిస్తామన్నారు. పులివెందుల నుంచి ఇరువురు ముఖ్యమంత్రిగా పట్టం కట్టినా అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, డైరెక్టర్ కొరియర్ ప్రసాద్, పులివెందుల టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డిలు పాల్గొన్నారు.